# హైదరాబాద్ వార్త

# సార్ ..బదిలీ కాకుండా చూడండి !

-మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ పలువురు జిహెచ్ఎంసి ఉద్యోగులు
-స్థానచలనం జరగకుండా చూడాలని నేతలకు విజ్ఞప్తులు
-తమజిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా సిఫార్స్‌చేసే యత్నం
-అవినీతి అధికారులు ..ఏళ్లుగా తిష్టవేసిన వారిపై కమిషనర్ ఫోకస్
-అంతర్గత బదిలీలపై కమిటీ నియామకం...
రిపోర్టు రాగానే మార్పులు



**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** జిహెచ్ఎంసిలో బదిలీల టెన్షన్ ఉద్యోగులకు పట్టుకుంది. ఏళ్ల తరబడి తాము అనుకున్న స్థానాల్లోనే ఉంటూ ఆడిందే ఆట..పాడిందే పాటగా సాగించిన పలువురు ఉద్యోగులు తమ స్థానచలనం తప్పదని టెన్షన్ పడుతున్నారు. ఈనేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ బదిలీల లిస్ట్ లో తమ పేరు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు తమ జిల్లాలోని ప్రజాప్రతినిధుల ద్వారా కమిషనర్‌కు చెప్పించే ప్రయత్నం చేస్తుండగా ..మరికొందరు తమ సామాజిక వర్గానికి చెందిన నేతలు, ఉన్నతాధికారుల ద్వారా పైరవీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈనేపథ్యంలో బదిలీలు జరిగితే ఎవరు ఉంటారూ.. ఎవరు పోతారూ అన్న చర్చ జిహెచ్ఎంసి ఉద్యోగుల్లో జోరుగా సాగుతుంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మున్సిపల్ ఈశాఖలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో మూడేళ్లకుపైగా ఒకేచోట పనిచేసే ఉద్యోగులపై ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా వివిధ విధ విభాగాల్లో బదిలీలు చేపట్టారు. ఈనేపథ్యంలో జిహెచ్ఎంసిలో సైతం జోనల్ స్థాయినుంచి కిందిస్థాయి వరకు ఉద్యోగుల దాకా వివరాలు సిద్ధంగా చేశారు. అయితే అప్పటి కమిషనర్ రోనాల్డ్‌రోస్ సెలవులపై వెల్లడం, రాగానే కమిషనర్ మార్పు జరగడం ఆతర్వాత కొత్త కమిషనర్‌గా ఆమ్రపాలిని నియమించడంతో అది పెండింగ్ పడిపోయింది. ఇటీవల వివిధ విభాగాలపై సమీక్షలు చేసిన కమిషన్ ఆమ్రపాలి ప్రధానంగా అవినీతి ఆరోపణలు, డ్యూటీలు సరిగా చేయనివారు, ప్రజలు అందుబాటులో లేకుండా ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంతోపాటు పలు విభాగాల్లో ఏళ్ల తిష్టవేసిన అధికారులకు, ఉద్యోగులను బదిలీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది.

**గతంలో బదిలీ అయినా.. మళ్ళీ అక్కడికే...**

ముఖ్యంగా సంస్థలో సర్కిల్ కార్యాలయం మొదలు ప్రధాన కార్యాలయం వరకు చాలా మంది ఉద్యోగులు సంవత్సరాల తరబడి పాతుకుపోయి విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీలు మొదలుకుని పదోన్నతులు వచ్చినప్పటికి బదిలీ అవ్వడం, తమ పలుకుబడి ఉపయోగించి రెండు మూడు నెలల్లో తిరిగి రావడం సాధాణం అయింది. ఒకవేళ బదిలీ అనివార్యమైతే పక్కనే ఉన్న సర్కిల్‌కు వెళ్తున్నారు. ఉదాహరణకు ఉప్పల్ సర్కిల్ నుంచి ఎల్‌బినగర్ గానీ, సికింద్రాబాద్‌కు వెళ్తున్నారు. కాప్రా సర్కిల్ నుంచి బదిలీ చేస్తే మల్కాజిగిరి సర్కిల్, అల్వాల్ నుంచి బదిలీ చేస్తే సికింద్రాబాద్ సర్కిల్‌కు వెళ్తూ, తిరిగి రెండు మూడు నెలలోపే పైరవీలు చేసుకుని అదే స్థానాలకు చేరుతున్నారు. అలాగే పాతబస్తీలో విధులు నిర్వహించే అధికారులల్లో చాలా మందికి బదిలీ ప్రక్రియ అంటే ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారుతుందన్న వాదన వినిపిస్తుంది. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, పారిశుద్ధ్యంతో పాటు పలు విభాగాల్లో ఈపరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తుంది. ఈనేపథ్యంలో కొత్త కమిషనర్ ఆమ్రపాలి ఇలాంటివారిపై ఎలాంటి చర్యలు తీసుకోతుందన్న చర్చ వినిపిస్తుంది.

**బదిలీలపై అడిషనల్ కమిషనర్లతో కమిటీ ...**

అంతర్గత బదిలీలపై దృష్టి సారించిన కమిషనర్ ఆమ్రపాలి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాయలం, జోనల్ ఆఫీసు , సర్కిల్ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సైతం అంతర్గతంగా స్థానచలనం కలిగించేందు నలుగురు అడిషనల్ కమిషనర్లతో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఈకమిటీలో అదనపు కమిషనర్ (ఫైనాన్స్ ) గీతారాధిక, అదనపు అదనపు కమిషనర్ (అడ్మిన్) నళినీ పద్మావతి, అదనపు కమిషనర్ (హెల్త్) పంకజా, అదనపు కమిషనర్ (లీగల్, ఎలక్ట్రికల్) సత్యనారాయణలతో కమిటీ నియమించారు. ఇప్పటికే సిద్ధం చేసిన జాబితాపై కసరత్తు చేసి, ఎవరిని ఎక్కడ నియమించాలన్న విషయంపై కమిటీ చర్చించి నివేదిక ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తుంది.

# ఆహార కల్తీ..రోగాలతో కుస్తీ

**హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త**

ఇటీవల ఇద్దరు మిత్రులు మేడిపల్లిలోని ఒక రెస్టారెంట్‌కు వెళ్లి చికెన్ కర్రీ, రొట్టెలు ఆర్డర్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వెయిటర్ వాటిని తీసుకొచ్చాడు. అది తింటుంటే కుళ్లిన వాసన వచ్చింది. ఇదేంటని అడిగితే స్పందన లేదు. అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే ఎవరికి చెప్పాలో అవగాహన బోర్డులు లేవు. తిని రోగాలు తెచ్చుకోవడం కంటే తినకుండా బిల్లు చెల్లించడం బెటర్ అని వచ్చేశారు. ఇది నగర శివారు ప్రాంతాల్లోనే కాదు..రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో పలు రెస్టారెంట్లలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.ఇక నగర శివారు మున్సిపాలిటీలు బోడుప్పల్, దుండిగల్, ఫీర్జాదిగూడ తదితర ప్రాంతాల పరిధిలో తనిఖీలు చేసేవారే కనిపించడంలేదు.

నగరంలో ఆహార రంగం అతిపెద్దది. చిన్నవి పెద్దవి కలిసి సుమారు 25వేల వరకు ఉంటాయి. నగరంలో బిర్యానీ, మాంసాహారం ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచాయి. వేలాదిగా ఉన్న హోటళ్లలో రోజు లక్షలాది మంది భుజిస్తుంటారు. జిహెచ్ఎంసి పరిధిలోని 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వారంలో 5 రోజులపాటైనా హోటళ్లు, మిఠాయి షాపులు, బేకరీలను తనికీలు చేసి ఆహార నాణ్యత పరిశీలించాల్సి ఉంటుంది. కానీ వారు కార్యాలయాల నుంచి కదలడం లేదన్న ఫిర్యాదులున్నాయి. తనిఖీలు లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో జరిగిన తనిఖీ సమయంలో కుళ్లిన ఆహార పదార్థాలు, లేబుల్ లేని తినుబండారాలు తయారు ప్రదేశాలను గుర్తించి తనిఖీచేపట్టారు. కుళ్లిన ఆహార పదార్థాలతోపాటు తయారు చేసే ప్రదేశం అధ్వాన్నంగా ఉండడం చూసి నివ్వెరపోయారు. మారుతున్న జీవన శైలిలో భాగంగా తినే ఆహారంలో అనేక మార్పులొచ్చాయి. భుజించే ఆహారంలో కల్తీ పెరుగుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

**అడ్డుకునే వారు లేదు..**

నగరంలో ఆహార కల్తీ ఆందోళన కలిగిస్తోంది. జిహెచ్ఎంసి ఆరోగ్య విభాగం మామూళ్ల మత్తులో మునిగిపోవడంతో చివరకు చిన్నారులు తాగే పాలు, తినే చాక్లెట్ల నుంచి ఆహార పదార్థాల వరకు కల్తీ అధికమైంది. చాలా హోటళ్లలో కుళ్లిన మాంసం, పాడైన వస్తువులతో వండి వారుస్తున్నారు. తనిఖీలు లేకపోవడంతో లక్షలాది మంది నాణ్యత లేని ఆహారాన్నే తినాల్సి వస్తోంది. బల్దియా పరిధిలో సుమారు 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా చాలా మంది ప్రధాన కార్యాలయాన్ని వదిలి క్షేత్రస్థాయికి రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. చిన్న హోటల్ నుంచి మొదలుకొని రెస్టారెంట్ల వరకు ఆహారం కల్తీ జరుగుతుంది. వంటల్లో నాణ్యమైనా మంచి నూనె వాడడం లేదు. కొన్నిసార్లు వాడిన నూనెను పదేపదే వాడడంతో విష పదార్థాలు తయారవుతున్నాయి. తాజా కూరగాయలతో వంటలు చేయకపోవడం, బిర్యానీల్లో ఆకర్షించేలా రంగులను వాడుతున్నారు. నూడుల్స్ రుచిగా ఉండేలా కొన్ని పదార్థాలు కలుపుతుంటారు. ప్రతి ఆహార పదార్థంల్లో కల్తీ చేసి విక్రయిస్తుంటారు. జాగ్రత్తగా గమనించి కొనుగోలు చేయాలి. క్షేత్రస్థాయిలో నాసిరకం పదార్థాలు విక్రయిస్తున్నా పరిశీలించాల్సిన అధికారులు కానరావడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి వస్తువుపై లేబుల్ ఉంచాలి. తయారీ తేదీ, అందులో కలిపే వస్తువులు, గడువు వివరాలు ఉండాలి. మార్కెట్లలో పలు రకాల అప్పాలు, పచ్చళ్లు, చిప్స్, కారం, బందో, పాపుడాలు, అప్పడాలు, పచ్చళ్లు, చిన్న పిల్లలు తినే ప్యాకెట్లు అనుమతులు లేకుండానే తయారు చేస్తున్నారు. శివారు ప్రాంత జిల్లాల వారీగా ఆహార కల్తీ నిరోధక శాఖలను ఏర్పాటు చేశారు. జిల్లాకు ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించారు. అధికారులు ఆహార భద్రత, పరిరక్షణ, ప్రమాణాలను పర్యవేక్షించాలి. వీరికి సహాయకులుగా జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లను నియమించారు. అయినా వీరి పర్యవేక్షణ, తనిఖీలు, కేసుల నమోదులు కనిపించడంలేదు.

**వ్యాధులకు మూలం...**

నాణ్యతను అసలు పట్టించుకోవడం లేదు. మాంసాహార వంటకాలకు రంగు తెప్పించేందుకు నిషేధిత టర్‌ట్రాజైన్ అనే సింథటిక్ రసాయానాన్ని కలుపుతున్నారు. అలాగే యూరియాతో పాలు తయారు చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చాయి. అయినా నగర ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దీన్ని పరిగణనలోకి తీసుకోలేదు. మిఠాయిల్లోనూ నాణ్యత ఉండడం లేదని గతంలో ఫిర్యాదులు, తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. నాసిరకం వంట నూనెలు తయారవుతున్నాయి.అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారి వెలుగులోకి వచ్చినా పూర్తిగా నియంత్రించలేకపోతున్నారు. జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు కనీస సమీక్ష చేయడం లేదు. బయటి ఆహారం తినడంలో చాలా రోగాలు వచ్చే అవకాశముంది. వీలైనంత వరకు తగ్గించుకుంటే మంచిది. ప్రస్తుతం చాలా మంది ఆర్డర్ పెట్టి ఫుడ్ ఇంటికి తెప్పించుకుంటున్నారు. వారు ప్రమాదకరమైన కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు.మంచి నూనె వాడకపోవడం, వాడినా నూనెనే మళ్లీ వాడడంతో కడుపు నొప్పి వాంతులు, విరేచనాలు, బరువు పెరగడం, అజీర్ణం, బీపీ, మధుమేహం, శరీరంలో రోగనిరోధకశక్తి తగ్గిపోవిడం, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. తర్వాత అది పచ్చకామెర్లకు దారి తీసి క్యాన్సర్ కూడా రావచ్చు. కవర్లలో టీ, కూరలు,బిర్యానీ పార్సిల్ తీసుకుపోతుంటారు.ఇది అత్యంత ప్రమాదకరం.క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

**కఠిన శిక్షలు..**

పరిరక్షణ లేని ఆహారాన్ని ఎవరు తయారు చేసినా, అమ్మినా, నిల్వ చేసినా, సరఫరా చేసినా ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ 2006 చట్టం ద్వారా శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. అనుమతిలేకుండా విక్రయిస్తే ఆరు నెలల జైలు, రూ.లక్ష వరకు జరిమానా వేస్తారు. ఆరోగ్యానికి హానికరంగా ఉంటే ఏడాది జైలు శిక్ష రూ.3లక్షల వరకు జరిమాన ఉంటుంది. తీవ్ర అనారోగ్యానికి గురి చేసే ఆహార పదార్థలైతే ఆరు నెలల జైలు శిక్ష రూ.5లక్షల వరకు జరిమానా వేస్తారు. మృతికి కల్తీ ఆహారం కారణమైతే జీవిత ఖైదు, రూ.10లక్షల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి.

# పెట్రోల్ బంక్ ట్యాంక్‌లో మంటలు..

-భయాందోళనతో పరుగులు పెట్టిన వాహనదారులు
-సకాలంలో మంటలు ఆర్పడంతో తప్పిన పెను ప్రమాదం



**పంజగుట్ట, ఆగస్టు 2 (ప్రభాతవార్త):**

ప్రజాభవన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో ఒక్కసారిగా మంటలు చలరేగాయి.బంక్‌లోని భూ అంతర్గత భాగంలో ఏర్పాటు చేసిన ట్యాంక్ మూతను తీసేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా మంటలు రేగాయి. దీనిని గమనించిన వాహనదారులు అక్కడ నుండి భయాందోళనలతో పరారయ్యారు. అయితే సిబ్బంది వెంటనే తేరుకుని ఫైర్ ఫైటర్లను ఉపయోగించు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.ముందు జాగ్రత్తగా ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చి ఆ ప్రాంతమంతా నీటితో క్లీన్ చేశారు. ఘటన జరిగిన వెంటనే అక్కడ పనిచేస్తున్న సిబ్బంది సమయస్ఫూర్తి ప్రదర్శించడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే మంటలు పెద్దగా చెలరేగితే అక్కడే నిలిపి ఉన్న రెండు ఫ్యూయల్ ట్యాంకర్లు కూడా పేలిపోయి ఉండేవని స్థానికులు తెలిపారు. మొత్తంమీద పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రేమ పేరుతో వేధింపులు

-మైనర్ బాలిక ఆత్మహత్య..

**జవహర్‌నగర్, ఆగస్టు2 ప్రభాతవార్త:** ప్రేమ పేరుతో వేధింపులు అధికం అవ్వడంతో భరించలేక ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుషాయిగూడ ఏసిపి మహేష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్ శ్రీరామ్ నగర్‌లో సిద్దిపేట జిల్లా హుస్నాపూర్‌కు చెందిన కుమార్, శారదాలు తమ ముగ్గురు కూతుళ్ళతో కలసి నివసిస్తున్నారు. కాగా తండ్రి కుమార్ సెంట్రింగ్, తల్లి శారద కంటోన్మెంట్‌లో స్వీపర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి దగ్గరలో ఉండే శివ(20) అనే యువకుడు గత కొంత కాలంగా శాలిని (16) బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఇటీవల వేధింపులు ఎక్కువ అవ్వవడంతో వేధింపులను తట్టుకోలేక గురువారం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఊరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఇంటి తలుపులను తొలగించి చూడగా అప్పటికే మృతి చెందింది. విషయం జవహర్‌నగర్ పోలీసులకు తెలియజేయడంతో తల్లి శారద ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య..

**దుండిగల్, ఆగస్ట్ 2, ప్రభాతవార్త**

ఫ్రెషర్ పార్టీ కోసం తల్లిదండ్రులు పంపిన దుస్తులు నచ్చలేదని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పుట్టి వినోద, వెంకటేష్‌ల కుమారుడు పి.నిఖిల్ (16) దుండిగల్‌లోని ఎన్ఎస్ఆర్ ఇంపల్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతున్నాడు. ఫ్రెషర్ పార్టీ కోసం కొత్త డ్రెస్ కావాలని తల్లిదండ్రులను అడగడంతో, గురువారం ఉదయం తల్లిదండ్రులు నిఖిల్‌కు కొత్త దుస్తులు, నోట్ పుస్తకాలు క్యాంపస్‌కి వెళ్లి ఇచ్చారు. ఆ తరువాత నిఖిల్ తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి మీరు తెచ్చిన ప్యాంట్ బాగోలేదని, కొత్త డ్రెస్ నచ్చలేదని చెప్పాడు. కొత్త డ్రెస్ నచ్చకపోతే వేరే డ్రెస్ వేసుకోమని తండ్రి మందలించాడు. కాగా శుక్రవారం రూమ్‌మెంట్స్ నిఖిల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులకు తెలియజేసి, నిఖిల్‌ను మల్లారెడ్డి హాస్పిటల్‌కు తరలించగా డాక్టర్లు మృతి చెందినట్లు తెలిపారు. కొత్త దుస్తులు నచ్చలేదని నిఖిల్ మనస్థాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసి డ్రైవర్ నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

-పది రోజులుగా ఆసుపత్రిలో పోరాడి మృతి చెందిన బాధితుడు

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** నిర్లక్ష్యంగా ఆర్టీసి బస్సును నడిపిన ఓ డ్రైవర్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న అమాయకుడిని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రి పాలైన అభాగ్యుడు దాదాపు పది రోజుల పాటు చికిత్స పొంది చివరకు తుది శ్వాస విడిచాడు. సాక్షాత్తు సిసి కెమెరాలో నమోదైన ఈ ఘోరం నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లెలగూడ ప్రాంతంలో నివసించే కూలి పనులు చేసుకునే శివయ్య బాలాపూర్ చౌరస్తాలో అడ్డా వద్దకు పని కోసం వచ్చాడు. అయితే లేబర్ అడ్డా సమీపంలో శివయ్య నడుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో యు టర్న్ తీసుకుంటూ వెనుక నుండి నెమ్మదిగానే వచ్చిన ఆర్టీసి బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన బాధితుడిని ఆసుపత్రికి తరలించగా అక్కడ పది రోజులుగా చికిత్స పొందుతూ శివయ్య మృతి చెందాడు. అయితే ఈ ప్రమాదానికి సంబంధించి డ్రైవర్ నిర్లక్ష్యపు ధోరణ ఉదంతం సిసి కెమెరాల్లో నమోదై వైరల్ అయ్యింది. మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు_న్నారు.





హుస్సేన్‌సాగర్‌లో అత్యవసర పరిస్థితులలో ప్రజలను ఎలా కాపాడాలి అవగాహన కొరకు ప్రదర్శన నిర్వహించిన ఆర్మీ, డిఆర్ఎఫ్, ఫైర్, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

## 5నుంచి 8వరకు " స్వచ్ఛదనం -పచ్చదనం "

-నిర్వాహణకు వార్డులవారీగా ప్రత్యేక బృందాలు
-జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి

**హైదరాబాద్ ,ఆగస్టు 2,ప్రభాతవార్త:**

ఆగస్టు 5నుంచి 9వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిహెచ్శ్రీంసిఒ కమిషనర్ ఆమ్రపాలి కాట పిలుపునిచ్చారు. ఈమేరకు కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం జోనల్ కమిషనర్లు ,అడిషనల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన పలుసూచనలు చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశుద్ధ్యం, పచ్చధనాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నిర్దేశించిన రోజు కార్యక్రమాలను నగరంలోని అన్నివార్డుల్లో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అందుకు అన్ని విభాగాల అధికారులతో కలిసి టీంలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజలకు ఉపయోగకరమైన మొక్కలను ఇంటింటికి పంపిణీ చేయాలని, అదేవిధంగా కమ్యూనిటీ హాల్స్ పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వం ఒక్కోరోజు ఒక్కో వినూత్న కార్యక్రమం నిర్దేశించిన నేపథ్యంలో ఆయా రోజులల్లో అట్టి కార్యక్రమాన్ని నిర్వహించి సాయంత్రం 4గంటల లోపు నివేదిక సమర్పించాలని అదేశించారు. ఈకార్యక్రమంపై టౌన్‌లెవల్, స్లమ్‌లెవల్ ఫెడరేషన్, ఆర్‌సిలు, పివోలు టాక్స్, శానిటేషన్ ఎస్ఎఎస్‌పలు క్షేత్రస్థాయిలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## "సప్తముఖ మహాశక్తి గణపతి "గా ఖైరతాబాద్ గణేషుడు

-ఈఏడాది 70 అడుగుల ఎత్తులో భక్తులకు దర్శనం
న-నమూనా విడుదల చేసిన ఉత్సవ కమిటీ




**హైదరాబాద్, ఆగస్టు 2,ప్రభాతవార్త:**

తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో ప్రఖ్యాతిగాంచిన ఖైరతాబాదాద్ మహాగణపతి ఈఏడాది సప్తముఖ మహాశక్తి గణపతిగా భక్తులు దర్శనమివ్వనన్నాడు. ఈమేరకు శుక్రవారం ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ విగ్రహ నమూనాను విడుదల చేసింది. ఈఏడాది గణేషుడు 70అడుగుల ఎత్తులో ఉండనున్నాడు. గణణాథుడికి కుడి వైపున శ్రీవివాస కళ్యాణం, ఎడమవైపున శివ పార్వతుల కళ్యాణం ఏర్పాటు చేయనున్నారు. ఇక ప్రత్యేక ఆకర్షణగా ఆయోధ్య బాల రాముడి ప్రతిమను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహాకులు తెలిపారు.

# దోమలపై యుద్ధం ..

-కాలనీలు,బస్తీల్లో జిహెచ్ఎంసి అవగాహన కార్యక్రమాలు
-ఇంటిపరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచనలు
-డెంగీ కేసులు ఉన్న ప్రాంతాల్లో రసాయనాల పిచికారి



చాంద్రాయణగుట్టలో బస్తీవాసులకు అవగాహన కల్పిస్తున్న జిహెచ్ఎంసి సిబ్బంది

**హైదరాబాద్,ఆగస్టు 2,ప్రభాతవార్త:**

దోమల నివారణ, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలు అప్రమత్త తీసుకోవాల్సిన ఫ్రైడే -డ్రైడే నాడు చేయాల్సిన కార్యమ్రాలపై జిహెచ్ఎంసి వ్యాప్తంగా పలు పాఠశాలలు జిహెచ్ఎంసి హీరోస్ (వాలంటీర్లు) శుక్రవారం పలు కాలనీలల్లో ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు ప్రభలడానికి గల కారణాలను ,నీళ్ల నిలువ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలల్లో నీళ్ల నిలపకుండా చూడడటంతోపాటు గుంతలల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ వేయడం లాంటివి చేయాలని ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంట్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ,తడిపొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛఆటోలకు అందజేయాలని సూచించారు. ప్రతిశుక్రవారం డ్రైడేగా పాటించాలని, నీటిడ్రమ్ములతో నీటిని ఖాళీ చేసి శుభ్రం చేసి ఆరబెట్టి తిరిగి కొత్తనీళ్ల పట్టుకోవాలని ,కొబ్బరి బోండాలల్లో, టైర్లు, కుండీలల్లో నీళ్ల నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలనిసూచించారు. అలాగే ఇంటి చుట్టుపక్కల గల గుంతలను పూడ్చి వేసుకోవాలని, ఇళ్ల ఇంటి పరిసరాలు వర్షాకాలంలో అన్ని వేళలా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో విద్యార్థి వాలంటరీర్లతోపాటు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డెంగ్యూ ప్రబలిన ప్రాంతాల్లో వారి ఇంటిచుట్టూ దోమల నివారణ రసాయనాలు పిచికారి చేశారు.

# ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ చిన్నారిపై అసభ్య ప్రవర్తన..!

-విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన - ఫోక్సో కేసు నమోదు

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చదువుతున్న రెండో తరగతి చిన్నారిపై అదే పాఠశాలకు చెందిన ఒక తొమ్మిదవ తరగతి విద్యార్థి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తుండగా, తమకు సమాచారం అందిన వెంటనే తగు చర్యలు తీసుకున్నామని పాఠశాల నిర్వహకులు పేర్కొంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పీర్జాదిగూడలో నివసించే ఒక వ్యక్తి కుమారుడు(14) ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో ఉప్పల్ పరిధిలో నివసించే ఒక వ్యక్తి కుమార్తె(6) కూడా రెండో తరగతి చదువుతోంది. అయితే తొమ్మిదవ తరగతి చదువున్న బాలుడు గురువారం మధ్యాహ్నం అదే పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఒక చిన్నారిని తరగతి గదిలోకి తీసుకెళ్లాడు. కొందరు విద్యార్థులు ఉండగానే సదరు విద్యార్థి చిన్నారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చిన్నారిని బెదిరించి పంపించివేసినట్లు సమాచారం. అయితే సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత చిన్నారి జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పడంతో వారు వెంటనే పాఠశాల వద్దకు వచ్చి ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. తొమ్మిదవ తరగతి విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి ఇరువర్గాలను మాట్లాడించినట్లు తెలిపారు. విద్యార్థికి టిసి ఇచ్చి పంపించి వేసి కేసు లేకుండా చూసేందుకు ప్రయత్నించారు. శుక్రవారం ఉదయం చిన్నారి తల్లిదండ్రులు మరికొందరితో కలిసి స్కూల్ వద్ద ఆందోళన నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీ నేతలు విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతుగా ధర్నా చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేయగా, ఉపాధ్యాయుల తీరుపై పలువురు తీవ్రంగా మండిపడ్డారు. స్కూల్ యజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపించారు. జరిగిన తతంగం సిసి కెమెరాలలో రికార్డు కావడంతో పోలీసులు దానిని సీజ్ చేశారు. ఏసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సదరు విద్యార్థిపై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు.

**బిజెపి, కాంగ్రెస్, సిపిఎం, ఎఐఎస్ఎఫ్ నేతల ధర్నా :**



లిటిల్ ఫ్లవర్ స్కూల్ ముందు ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జరిగిన సంఘటనపై పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ విద్యార్థి సంఘాలు, పార్టీ నేతల ఆధ్వర్యంలో స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు. బిజెవైఎం. మహిళా మోర్చ యూత్ కాంగ్రెస్, సిపిఎం, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల నేతలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. బిజెవైఎం నేతలు గోనె శ్రీకాంత్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, సింగారం కార్తీక్, బిజెపి మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, యూత్ కాంగ్రెస్ నేత అకారపు అరుణ్‌కుమార్, సిపిఎం కార్యదర్శి జె.వెంకన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాదోడ్ సంతోష్, అన్వర్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద తదితరులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కొ విద్యార్థి నుంచి రూ.లక్షలలో పీజుల వసూలు చేస్తున్న యజమాన్యం విద్యార్థుల విషయంలో పట్టించుకోవడం లేదని, చిన్నారిపై లైంగిక వేధింపులు జరిగినా కూడా బయటకు రాకుండా రాజీ బేరం చేశారని ఆరోపించారు. పాఠశాల గుర్తింపు రద్దు చేసి యజమాన్యంపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

**ప్రిన్సిపల్ బ్రదర్ జోసఫ్ వివరణ :**

లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారిపై అసభ్య ప్రవర్తించిన సంఘటన తెలిసిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడినట్లు స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ జోసెఫ్ తెలిపారు. ఇరువర్గాలు చర్చించుకుని వెళ్లిపోయారని, అసభ్యకరంగా ప్రవర్తించిన విద్యార్థికి టిసి ఇచ్చి పంపించినట్లు ఆయన తెలిపారు. జరిగిన సంఘటన ఎంతో బాధకరమని, దీనిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

## శ్రామిక మార్గం మాసపత్రిక ఆవిష్కరణ..



శ్రామిక మార్గం మాసపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు, సిపిఐ నాయులు

**జగద్గిరిగుట్ట, ఆగస్ట్ 2, ప్రభాతవార్త**

జగద్గిరిగుట బస్‌స్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రామికమార్గం మాసపత్రికను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించడం జరిగింది. మున్సిపల్ మహిళా కార్మికులు గీతా నాయక్, బిక్లి నాయక్, పుష్పా, దాస్లి, అలివేలులు ఆవిష్కరించి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) రాష్ట్ర నాయకులు ఏసురత్నం, సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు, కవి రచయిత మోహన్ బైరాగి సంపాదకుడుగా వెలువడుతున్న శ్రామిక మార్గం మాసపత్రికను భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ కార్మికులు వేలాది శ్రామిక ప్రజలు నివసించే జగద్గిరిగుట్టలో మున్సిపల్ మహిళా కార్మికుల చేతుల మీదుగా ఆవిష్కరించడం అభినందనీయమని అన్నారు. సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా కవిగా రచయితగా మోహన్ బైరాగి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రామిక మూర్గం మాసపత్రిక మరింత అభివృద్ధి చెంది శ్రామిక జన పక్షపాతిగా తన ప్రయాణం కొనసాగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పత్రిక అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హరినాథ్‌రావు, రాములు, ప్రవీణ్, ప్రభాకర్, ఆవుల నాగరాజు, వెంకటేశ్వరరావు, ప్రవీణ్, వెంకటేష్, సోమయ్య, జర్నలిస్టులు డప్పు రామస్వామి, వెంకట్ మున్సిపల్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారందరికి మోహన్ బైరాగి ధన్యవాదాలు తెలిపారు.

## కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో డ్రైడే



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

**కొంపల్లి, ఆగస్ట్ 2, ప్రభాతవార్త**

కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో శుక్రవారం వివిధ వార్డుల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది వివిధ వార్డుల్లో కుండీలు, నిరుపయోగంగా ఉన్న బిందెల్లో నిలిచిపోయిన నీటిని తొలగించడం, మురికి ప్రదేశాలను పరిశుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్, రసాయనాలను స్ప్రే చేశారు. దోమల ఉత్పత్తిని నిరోధించడానికి ఆయిల్ బాల్స్‌లను నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో వేశారు. ఇతర పరిశుభ్రత కార్యక్రమాలపై దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె.శ్రీహరి, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముప్పైఏళ్ల కల సాకారం అయింది

**ముషీరాబాద్, ఆగస్ట్ 2, ప్రభాతవార్త:** ముప్పై సంవత్సరాల కల సాకారం అయిందని, మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే నిన్న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పని ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు గండి కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు అమ్ముగూడెం దశరథ్ మాదిగ ఆధ్వర్యంలో ఇందిరా నగర్ బస్తీలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల వద్ద మందకృష్ణమాదిగ చిత్రపటంకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గండికృష్ణమాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణమాదిగ చేసిన పోరాటాల ఫలితమే నిన్న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో మాదిగల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు చిలక ఎల్లయ్య మాదిగ, రోషన్ వినయ్‌రావు మాదిగ, ఇల్లెందుల ఎల్లయ్య మాదిగ, రాంపాక వెంకటేష్‌మాదిగ, పాపిడి రాజు మాదిగ, దానయ్య, ఉమర్‌భాయ్ పాల్గొన్నారు.

## టౌన్‌ప్లానింగ్ సిసిపిగా శ్రీనివాస్ బాధ్యతలు



సిసిపి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న రాజేంద్రప్రసాద్ నాయక్, టౌన్‌ప్లానింగ్ అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 2,ప్రభాతవార్త:**

జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగం చీఫ్ సిటీ ప్లానర్‌గా (సిపిపి)గా కె.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు సిసిపిగా కొనసాగిన రాజేంద్ర ప్రసాద్ నాయక్‌ను హెచ్ఎండీఏకు బదిలీ చేసి...ఆయన స్థానంలో కె.శ్రీనివాస్‌ను నియమిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో శుక్రవారం సిసిపిగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

### వాహనదారులంతా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి
### - నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్

**నార్సింగి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** వాహనదారులంతా స్వచ్ఛందంగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని నార్సింగి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయనకు స్టేషన్‌లోని ఎస్.ఐలు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రదీప్ మాట్లాడుతూ రోడ్లపైకి రోజు రోజుకు వేలాది వాహనాలు కొత్తవి వస్తున్నాయని, రోడ్లు ఎంత విశాలంగా ఉన్నా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా ఉదయం 8.గంటల నుంచి 11.గంటల వరకు సాయంత్రం 4.గంటల నుంచి రాత్రి 8.గంటల వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని, వాహనదారులు నిబంధనలను పాటించి, ట్రాఫిక్ సిగ్నళ్లను గమనిస్తూ డ్రైవింగ్ చేస్తే చాలా వరకు సమస్య తీవ్రత తగ్గుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు పెట్టుకోవాలని, కార్లు తోలే వారు సీటు బెల్టులు పెట్టుకోవాలని సూచించారు. వీటిని పెట్టుకొని ప్రమాదాల పాలైన వాహనదారులు చాలా వరకు ప్రాణాలతో బయట పడ్డారని, ఇవి లేని కారణంగా చిన్న ప్రమాదాలకే ప్రాణాలు కోల్పోయరని వివరించారు. మద్యం సేవించి వాహనాలు తోలడం మనతో పాటు మన పక్క వారికి కూడా ప్రమాదమే అని, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే జైలు శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, వాహనాలు తోలే వారు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు, ఆర్.సి, పొల్యూషన్, ఇన్సూరెన్స్ వంటి డాక్యుమెంట్లు ఖచ్చితంగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. సిబ్బంది అందరి సహకారంతో నార్సింగి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా విధులు నిర్వహిస్తామని నూతన ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ వివరించారు.

## తెలంగాణ సంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకలు బోనాలు : కమిషనర్ కృష్ణ ఆదిత్య



బోనాలు ఉత్సవాల్లో పాల్గొన్న కార్మిక శాఖ కమిషనర్ కృష్ణఆదిత్య, అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్, జెసిఎల్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు

**చిక్కడపల్లి, ఆగస్టు 2ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతిక సంప్రదాయాలకు ప్రతిబింబాలుగా బోనాలు ఉత్సవాలు నిలుస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. శుక్రవారం ఆర్టీసి క్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఉన్న దుర్గానల్లపోచమ్మ అమ్మవారి దేవాలయంలో ఉద్యోగులు సుదీర్, శేఖర్, శ్రీనివాస్, రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు కమిషనర్ కృష్ణఆదిత్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ డాక్టర్ ఇ.గంగాధర్, రాష్ట్ర సంయుక్త కమిషనర్ చంద్రశేఖరం, రంగారెడ్డి, హైదరాబాద్ జంట నగరాల జాయింట్ కమిషనర్‌లు శ్యామ్‌సుందర్‌రెడ్డి, సునీత, డిప్యూటీ కమిషనర్‌లు శ్యామ్‌సుందర్‌జాజు,శ్రీనివాస్‌గౌడ్, ప్రమోద్‌రెడ్డి, నీలమ్మ, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్‌లు సత్యనారాయణరెడ్డి, జసన్, వెంకటరెడ్డి, లేబర్ ఆఫీసర్ టి.శిరీష, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సుప్రీం కోర్టు తీర్పుపై ఓ.యూ మాదిగ అధ్యాపకులు హర్షం



మాట్లాడుతున్న ఓ.యూ అధ్యాపకులు ప్రొ.గడ్డ మల్లేశం తదితరులు

**తార్నాక, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు పట్ల ఉస్మానియా యూనివర్సిటీ మాదిగ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేశం పాల్గొని మాట్లాడుతూ అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు సామాజిక న్యాయం చేకుర్చడానికి వచ్చిన తీర్పు అన్నారు. వర్గీకరణ కోసం అసువులు బాసిన అమర వీరుల ఆత్మలకు శాంతి చేకూరుతుందన్నారు. వర్గీకరణ కోసం పోరాడిన వారందరికి పేరు పేరున ధన్యవాదాలన్నారు. పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుధల కానున్న నేపథ్యంలో వర్గీకరణ పట్ల కోర్టు తీర్పు ప్రకారం సీట్లను భర్తీ చేసే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రూప్ వన్ మెయిన్స్ ఇంటర్వ్యూలల్లో కూడ రిజర్వేషన్లు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వేషన్‌పై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలన్నారు. వెంటనే ఆర్డినెన్స్ తీసుకువచ్చి రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల వర్గీకరణ చేసి అమలు చేయాలని ప్రొ. మల్లేశం కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు, ప్రొ.కాశీం, ఓ.యూ ఛీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్, ప్రొ. డైసీ, డా. మేడి శ్రీనివాస్, డా. వంశీధర్ తధితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
### -ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య



ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్యను కలిసిన తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు

**చిక్కడపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త:**

బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లనే ఇటీవల ప్రకటించిన అసెంబ్లీ బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు సిఎం రేవంత్‌రెడ్డి రూ.50కోట్లు కేటాయించారని ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. బ్రాహ్మణుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి బడ్జెట్‌లో పరిషత్‌కు నిధులు కేటాయించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో బీరయ్య అయిలయ్య ఇచ్చిన డిమాండ్లను ప్రభుత్వం దృసుకెళ్ళి వాటిని అసెంబ్లీలో చర్చించి నిధుల కేటాయింపు చేసినందుకుగాను సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు శుక్రవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి సత్కరించారు. బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అన్నివర్గాల ప్రపజల మద్దతు ఉందని, అదే తరహాలో బడ్జెట్‌లో అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. వక్కలంక శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బ్రాహ్మణుల విదేశీ విద్యకు సంబంధించిన 800 మంది విద్యార్థులకు రూ.150 కోట్లను కూడా విడుదల అయ్యేలా చూడాలని కోరారు. అదే విధంగా జిల్లాల్లో బ్రాహ్మణ భవనాలు, వేద పాఠశాలలు, కల్యాణ భవనాలు, గోశాలల నిర్మాణానికి కూడా ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు మంగపతిరావు, స్వరూప్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### గురంపోడు నిర్వాసితులు పట్టాల కోసం 9న నిరసన ప్రదర్శన

**సైఫాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లాలోని గురంపోడు నిర్వాసితుల భూములకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీన బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తారని తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల ప్రజా సంఘం (పియుసిఎల్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకిషన్‌రావు, జయవింధ్యాల, గురంపోడు భూ పరిక్షణ సమితి అధ్యక్షుడు బాలాజీనాయక్ తెలిపారు. 1959లో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద నిర్వాసితులైన 350 గిరిజన కుటుంబాలకు సూర్యాపేట జిల్లాలోని సర్వే నెంబరు 540లో ప్రభుత్వం ఇళ్ళను నిర్మించి, వ్యవసాయ భూములుగా 1832 ఎకరాలు కేటాయించిందని ఆనాటి నుంచి నేటి వరకు నిర్వాసితులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వకుండా అధికారుల దాటవేస్తున్నారని శుక్రవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ఆరోపించారు. ఆ సర్వే నెంబరులో 6200 ఎకరాల భూమి ఉందని, అందులో వివిధ రాజకీయ పార్టీల నాయకులకు చెందిన కుటుంబ సభ్యులు సిమెంట్ ఫ్యాక్టరీలు నెలకొల్పి మెల్ల, మెల్లగా భూములను అక్రమించుకో వడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హాయంలో నాగార్జునసాగర్ ఆయకట్టు పనిపూర్తి అయ్యిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున రాష్ట్ర మంత్రి అయిన సీతక్క స్పందించి ఈ గిరిజనులకు ఆమె చేతులు మీదగా పట్టా పాస్ పుస్తకాలను పంపిణి చేయాలని వారు కోరారు.

### శ్రీ అక్కన్న మాదన్న మందిరంలో కుంకుమార్చన

**చార్మినార్,ఆగస్టు 2 ప్రభాతవార్త :**

ఆషాడ మాసం నాలుగువ శుక్రవారం సందర్భంగా పాతబస్తీ హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ మందిరంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతనగరంలోని పలు ప్రాంతాలకు చెందిన దాదాపు మూడు వందల మంది మహిళలు పాల్గొన్నారు.అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో మందిరం కమి టి ప్రతినిధులు పాల్గొన్నారు.

# బందీఖానాలో బాల్యం

## -పసి వయసులోనే పనులకు
## -చదువు లేక ఎదగలేని పసివాళ్ళు పనివాళ్ళుగా మారుతున్నారు
## -155 మంది శ్రమ దోపిడీ చేసే యజమానులు అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్ట్ 2, ప్రభాతవార్త:** బాల కార్మికులను, బిక్షమెత్తుకుంటున్న పసి పిల్లలను విముక్తుల్ని చేయడానికి ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌లను పోలీసు శాఖ ముమ్మరం చేసింది. ఇంటి నుంచి తప్పిపోయి, బిక్షమెత్తుకుంటూ, రోడ్డు మీద చెత్త ఏరుకుంటూ, వివిధ పనుల్లో శ్రమజీవులుగా అవస్థ పడుతున్న బాల కార్మికులను గుర్తించి దుర్భర పరిస్థితి నుంచి విముక్తి చేయడానికి ఆపరేషన్ ముస్కాన్-10 చేపట్టిన పోలీసు శాఖ వందల మంది పసిపిల్లలను బంధిఖానా నుంచి విముక్తుల్ని చేసింది. సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో 651 మంది బాలకార్మికులకి, భిక్షాటన చేస్తున్న పసిపిల్లలకీ విముక్తి లభించగా, రాచకొండ కమీషనరేట్ పరిధిలో జరిగిన ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 326 మంది పిల్లలు రక్షింపబడినట్లు సమాచారం. పిల్లలందరినీ చైల్డ్ వెల్ఫైర్ కమిటీ ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చి బాల కార్మిక వ్యవస్థపై కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరూ లేని బాలలకు పునరావాసం కల్పించి చదివించే విధంగా పోలీసులు చర్యలు తీసుకున్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకూ జరిగిన ఈ ఆపరేషన్‌లో హైదరాబాద్ వ్యాప్తంగా పిల్లలను పనిలో పెట్టుకున్నందుకు 155 మందికి పైగా నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై ఐపీసీ చైల్డ్ లేబర్ చట్టం, జువినైల్ జస్టిస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాచకొండ పరిధిలో విముక్తి పొందిన 326 మంది బాలల్లో 208 మంది అబ్బాయిలు, 10 మంది ఆడ పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రక్షింపబడ్డ బాలల్లో 11 మంది భిక్షాటనలో ఉన్నట్లు తెలిసింది. బాల కార్మిక వ్యవస్థను, గుట్టు చప్పుడు కాకుండా జరిగే బెగ్గింగ్ మాఫియాను అరికట్టేందుకు నగర వ్యాప్తంగా పోలీసులు వేరు వేరు బృందాలుగా విడిపోయి బంధిఖానా నుంచి బాలలను విముక్తుల్ని చేసి రక్షణా కేంద్రాలకు తరలిస్తున్నారు. పనికెళ్ళే పసిపిల్లలను గుర్తించే క్రమంలో నగర వ్యాప్తంగా మూడు కమీషనరేట్ల పరిధిలోనూ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్(ఏహెచ్‌టీయు) విభాగంలోని పోలీసులతో పాటు, ఉమన్ ఎండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ బృందం, షీటీమ్ సాయంతో 20 పోలీసు బృందాలు విధి నిర్వహణలో బాల కార్మికుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కమీషనర్ అవినాశ్ మహంతి, కమీషనర్ జి.సుధీర్ బాబుల ఆధ్వర్యంలో ఈ రెస్క్యూ ఆపరేషన్ల నిర్వహణ జరిగింది. వివిధ పరిశ్రమల్లోనూ, కంపెనీల్లోనూ తనిఖీలు నిర్వహించిన పోలీసు బృందాలు, భిక్షమెత్తుకుంటున్న పిల్లలను 'దర్పణ్ యాప్' సాయంతో ట్రేస్ చేసినట్లు తెలిపారు. మానవుల అక్రమ రవాణా మీద కూడా ఏహెచ్‌టీయు బృందాలు ఉక్కు పాదం మోపనున్నట్లు పేర్కొన్నారు. బాల కార్మికులు, భిక్షాటన చేసే పిల్లలు ఎవరికైనా కనిపించినా, మానవుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసినా తక్షణమే పోలీసులకు సమాచారమిచ్చే క్రమంలో 1 0 0 కు గానీ, 1 0 9 8 కు గానీ, 9490617444 కు గానీ డయల్ చేసి సమాచారమందించమని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

**బాల్యాన్ని ఛిదిమేస్తున్న శ్రమ దోపిడీదారులు :**

తక్కువ జీతంతో ఎక్కువ చాకిరీ చేయించుకునే నెపంతో శ్రమ దోపిడీ చేసే యజమానులు చట్ట వ్యతిరేకంగా బాలకార్మిక వ్యవస్థను పెంచుతున్నారు. బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే అధిక వేతనాలివ్వక్కర్లేదనే ఒకే ఒక్క కారణంతో పలువురు యజమానులు పక్క రాష్ట్రాల నుంచి వలస తెచ్చుకుంటున్నారు. ఇళ్ళు, హోటళ్ళు, బిల్డింగ్ పనులు, బ్యాకరీలు, కిరాణా దుకాణాలు, ఇటుకబట్టీలు, మెకానిక్ షెడ్లు తదితర పరిశ్రమల్లో పిల్లలను 9 పని గంటల కంటే ఎక్కువ సేపు వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. పేదరికం కారణంగా పిల్లల తల్లి దండ్రులు పసి వయసులోనే వారిని పనికి పంపుతున్నారు. ప్రతి నెలా వేతనంతో పాటు రోజూ భోజనం గడిచిపోతుండడంతో పిల్లలను పనులకు పంపేందుకు మొగ్గు చూపుతున్నారు. తద్వారా చదువు లేక ఎదగలేక పసివాళ్ళు పనివాళ్ళుగా మిగిలిపోతున్నారు. ఉత్తర ప్రదేశ్, ఒరిశ్సా, చత్తీస్‌ఘడ్, బీహార్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ మేఘాలయా వంటి వివిధ ప్రాంతాల నుంచి భాష తెలియని పక్క రాష్ట్రాలకు పిల్లలు వలస వెళ్తుండడంతో వారికి కనీస అక్షర జ్ఞానం కూడా లేకుండా పోతోంది. దాంతో వారి జీవితాల్లో ఎదుగుదల కరువై కూలి పనికే పరిమితమవుతున్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి దారుణ హత్య -నిందితుడు అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో వ్యక్తిని బండరాయితో తల పగలగొట్టి చంపిన దారుణ ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. రాజేంద్రనగర్ పరిదిలోని ఇందిరమ్మ కాలనీ ఎక్సైజ్ అకాడమీ వద్ద ఓపెన్ ప్లాట్ల ఖాళీ స్థలంలో గుర్తు తెలియని శవం ఉందని ఫిర్యాదు రావడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడిని మైకల వేణుబాబు అలియాస్ రేణుబాబు(35) గా గుర్తించారు. ఎవరో అతడిని తలపై బండరాయితో మోది హత్య చేసినట్లు తేలడంతో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో హత్యచేసిన దుండుగడు దవన్‌కర్ సాయి వర్షిత్(19)గా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఒక మోటర్ సైకిల్, రక్తపు మరకలైన చొక్కా, ఒక మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో వేణుబాబును హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. గురువారం అర్ధరాత్రి 12:00 గంటల సమయంలో వైన్ షాపుకు వెళ్ళిన నిందితుడు సాయి వర్షిత్, తన బంధువు వేణుబాబు తాగిన మైకంలో రోడ్డుమీద పడుండడం గమనించాడు. అతడిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని దగ్గరలో ఉన్న ఖాళీ స్థలానికి తీసుకెళ్ళి చితకబాదాడు. అనంతరం అతడి తలపై బండరాయితో మోది అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

### అనుమానంతో భార్యను అంతంమొందించిన భర్త
### -ఇనుప పానతో తలపై మోది దారుణ హత్య

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న ఓ భర్త దారుణానికి పాల్పడ్డాడు. ఏకంగా ఇనుప పానతో భార్య తలపై మోది పాశవికంగా హత్య చేశాడు. ఈ దారుణ సంఘటన హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హస్తినాపురం సమీపంలోని అగ్రికల్చర్ కాలనీలోనున్న ఉషోదయ రెసిడెన్సీ ఆపార్ట్‌మెంట్‌లో బొల్లారం రాజు (47) అనే వ్యక్తి భార్య జ్యోతి, నాలుగు సంవత్సరాల కూతురుతో నివసిస్తున్నాడు. అయితే ఇటీవల నుండి ఆయన తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో భార్యతో తరచుగా గొడవ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో భార్యను అంతం చేయాలని నిర్ణయించుకున్న రాజు తన కూతురును అత్తింటికి పంపాడు. గురువారం ఉదయం భార్యతో గొడవ పడి ముందే తెచ్చి ఇంట్లో పెట్టుకున్న ఇనుప పానతో జ్యోతి తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి లొంగిపోయినట్లు సమాచారం. అయితే హతురాలి తల్లి అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్స్‌పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో కేసు నమోదు అయ్యి దర్యాప్తు జరుగుతున్నది.

## రాజీవ్ గృహకల్ప ఇండ్ల కబ్జా..

### -రెవెన్యూ మున్సిపల్ అధికారులకు విన్నవించిన చర్యలు లేవు..
### -అధికారుల నిర్లక్ష్యం, అక్రమార్కుల దోపిడి : సిపిఎం

**నిజాంపేట్, ఆగస్ట్ 2, ప్రభాతవార్త**

నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప కేటాయించని ఇండ్ల కబ్జాను అరికట్టాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు విన్నవించిన ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని, అధికారుల నిర్లక్ష్యం అసలైన లబ్ధిదారులకు ఇండ్లు దక్కకపోగా అక్రమంగా ప్రజా ప్రతినిధుల అధికారుల అండదండలతో అమాయక ప్రజలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప ఇండ్ల కబ్జాను నివారించే చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో హౌసింగ్ బోర్డు అధికారులు కేటాయించని ఇండ్లకు సీలు వేసినప్పటికీ తాళాలు పగలగొట్టి కబ్జాదారులు కబ్జా చేసి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. బాచుపల్లి ఎమ్మార్వోకు సరేన్వ చేసి అసలైన లబ్ధిదారులకు కేటాయించాలని కోరినా పట్టించుకోవడంలేదని అన్నారు. వెంటనే రాజీవ్ గృహకల్ప ఇండ్ల కబ్జా అరికట్టి అసలైన లబ్ధిదారులకు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

### నేరేడ్‌మెట్ పరిధిలో తల్లీకొడుకుల అదృశ్యం..

**నేరేడ్‌మెట్,ఆగస్టు02 ప్రభాతవార్త:** తల్లి, కుమారుడు అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్ పోలీస్టేషన్ పరిధిలోని చంద్రబాబు నాయుడు నగర్‌లో నివాసమండే కెతావత్ శివ తన భార్య కెతావత్ అంజలి, కుమారు కార్తిక్‌లతో కలసి నివాసముంటున్నాడు. ఈ క్రమంలో గత నెల 26వ తేదీన మధ్యాహ్నం 12:30గంటల సమయంలో ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా తన కుమారు కార్తిక్‌ను తీసుకొని వెళ్ళింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త శివ తెలిసిన, బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకి తెలియకపోవడంతో నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 9, 10 తేదీలలో ఆదివాసీ హక్కులు-కార్పొరేటీకరణ'పై జాతీయ స్థాయి సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్. చిత్రంలో లక్ష్మణ్, నారాయణరావు, అన్వర్‌ఖాన్ తదితరులు

**సైఫాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9, 10 తేదీలలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఆదివాసీ హక్కులు-కార్పొరేటీకరణ' అనే అంశంపై అఖిల భారత సదస్సు నిర్వహిస్తున్నామని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక తెలిపింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘీభావ వేదిక ప్రతినిధులు హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ తదితరులు ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 9వ తేదీన జరిగే సదస్సులో దేశంలోని ప్రముఖులు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ప్రొఫెసర్ మనోరంజన్, ప్రొఫెసర్ సరోజగిరి, సోనిసోరి, మాలిని సుబ్రాహ్మణ్యం, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అనురాధ, సురేపల్లి సుజాత, కల్పనా కన్నాభిరాన్, డి.నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వారు చెప్పారు. 10వ తేదీన బాగ్‌లింగంపల్లి నుంచి ఇందిరాపార్కు వరకు భారీగా ర్యాలీ జరుగుతుందన్నారు. ఆదివాసీలపై ప్రపంచ వ్యాప్తంగా విధ్వంసం, హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆరోపించారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి బహిరంగంగా బస్తర్‌లోని ఖనిజాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తామని, దేశానికి సంపద సృష్టిస్తామని, అడవిలోని చెట్లను నరికివేసి మరొక చోట మొక్కలను నాటుతామని స్పష్టంగా ప్రకటించడం దారుణమన్నారు. ఆదివాసీలను ఎందుకు అణిచివేస్తున్నారని, వాతావరణాన్ని కాపాడుకోకుండా ఆదివాసీల పాదాల కింద ఉన్న ఖనిజాలను దోపిడీ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి నమూనా పేరిట ప్రజల హక్కులను హరించడం దారుణమన్నారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని దేశంలోని విద్యావంతులు, మేధావులు, రాజకీయ నాయకులు, హక్కుల నేతలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

## బిజినెస్‌లోన్ పేరుతో రూ.కోటిన్నర మోసం..నిందితులు అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** వ్యాపారులకు బిజినెస్ లోన్లు ఇప్పించే నెపంతో రూ.1.5కోట్లు మోసం చేసిన నిందితులని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడ్డ నిందితుల్లో ప్రధాన నిందితుడు మహమ్మద్ సద్దాన్ అన్సారీ(33) కాగా, మరొకడు షాజీ అహ్మద్ సిద్దిఖీ(45)గా గుర్తించారు. నిందితుల నుంచి 9 మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్ టాప్‌లు, 18 చెక్ పుస్తకాలు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. గతంలో వీరిపై విశాఖపట్నం, ముంబై, హైదరాబాద్‌లలో 6 లోన్ చీటింగ్ కేసులు నమోదయినట్లు వెల్లడించారు. వీరు ముఠాగా ఏర్పడి వ్యాపారులను టార్గెట్ చేసి భారీ మొత్తంలో డబ్బులు దండుకుంటున్నట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. నిందితుల్లో మరో 11 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి పేర్లు, వివరాలు సేఖరించిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మాదాపూర్ పోలీసుల కథనం ప్రకారం, లక్నోకు చెందిన మహమ్మద్ సద్దాన్ అన్సారీ హోటల్ వ్యాపారంలో నష్టాలు రాగా, విలాసవంతమైన జీవితంతో పాటు దుర్వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో అక్రమ ధనార్జనకు లోన్ల కొరకు నిరంతరం ప్రయత్నించే వ్యాపారులను టార్గెట్ చేశాడు. వారు ఇచ్చే కమీషన్లపై గురి పెట్టి, లోన్ల పేరుతో వరుస మోసాలకు పథకం వేశాడు. ఈ పథకంలో మరో 12 మందిని భాగస్వాములను చేసి, నకిలీ దందా మొదలు పెట్టాడు. అందుకు గానూ 2019లో ముంబైలోని ఖరీదైన బిల్డింగును అద్దెకు తీసుకుని మోసాలకు అనువుగా ఒక కార్యాలయాన్ని ప్రారంభించాడు. వ్యాపారుల ఫోన్ నెంబర్ల లిస్టును సంపాదించిన ఈ ముఠా, పలువురికి లోన్ల పేరుతో వల వేసింది. తమ వద్దకు వచ్చిన ఎందరో వ్యాపారులకు ముఠా సభ్యులు తమను తాము మీడియేటర్లుగా, కంపెనీ అసిస్టెంట్లుగా, పార్ట్‌నర్లుగా, అకౌంటెంట్లుగా, ఆఫీస్ ఉద్యోగులుగా పరిచయం సుకుని వరుస మోసాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో నిందితులు తమ కార్యకలాపాలు గోవాకు మార్చడంతో కొత్త కస్టమర్లు రావడం మొదలు పెట్టారు. ఈ తరుణంలో మాదాపూర్‌కు చెందిన కొడాలి శ్రీకాంత్ చౌదరికి తన సోలార్ బ్యాటరీ పరిశ్రమ అభివృద్ధికి గానూ ఒక ప్రైవేట్ బ్యాంక్ ద్వారా రూ.150కోట్లు లోన్ శాంక్షన్ చేయనున్నట్లు మభ్యపెట్టారు. కానీ లోన్ డబ్బు రాక మునుపే తమ కమీషన్ రూ.1.5కోట్లు బదిలీ చేయాలని తొందర పెట్టారు. అన్ని ఫార్మాలిటీలు పూర్తి చేసిన బాధితుడు, నిందితులు అడిగినంత డబ్బు పంపగా తనకి లోన్ రూపంలో ఎటువంటి నగదూ రాలేదు. తాను మోస పోయినట్లు ఆలస్యంగా గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, సైబరాబాద్ కమీషనర్ అవినాశ్ మహంతి ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు ముఠాలోని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా 11 మంది పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచారు.

## చైతన్య స్ఫూర్తిదాయకం అభినయ జాతీయ బహుభాషా నాటకోత్సవాలు

**రవీంద్రభారతి, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, అభినయ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ, కర్ణాటక ప్రభుత్వ కన్నడ సాంస్కృతికశాఖ సహకారంతో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో జరుగుతున్న 18వ అభినయ జాతీయ బహుభాషా నాటకోత్సవాలు-అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్ 2024 రెండవరోజు నాటక ప్రదర్శనల్లో ముందుగా 6.30గంటల నుండి భారతావనిలో పూర్వీకుల్లో పరాక్రమం, ప్రజలందరికి దేశభక్తి యొక్క అంతర్ దృష్టి రక్తమాంసాల్లో లోతుగా ఇమిడి ఉందని, అవి స్వచ్ఛందంగా బయటకు వచ్చిన కథనం రచన మఖోన్మణిమోంగ్ షాబా, ఫాజాటన్ చాను దర్శకత్వం, బనియన్ రిపర్టరీ థియేటర్ ఇంఫాల్, మణివారి సమర్పణలో రూపొందిన మణిపురి నాటకం లైహల్లి; అనంతరం 8గంటల నుండి అనాధి కాలంగా అత్తాకోడలు కలిసివుండే అంశానికి సంబంధించి ఆ ఇద్దరూ పరస్పర సంబంధం కలిగి ఉండడం కథాంశంగా ఆధిపత్యం, పిరికితనం, అణచివేత, ధైర్యం, సహనం, అసహనం, సంతోషం, దుఃఖం, పరస్పర అవగాహన, ప్రేమా గౌరవం .... సమాజానికి ఒక పాఠం, ప్రతిబింబమే మృణాళిని చితాలే నాటక రచన, సుహాస్ బార్వే దర్శకత్వంలో సోహమ్ థియేటర్, హైదరాబాద్ సమర్పణలో రూపొందిన మరాఠీ నాటకం ఆగా సున్‌బాయి కేమ్హంత సాసుబాయి నాటకాలు నటీనటులచే అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతుల ప్రశంసలు అందుకున్నాయి. నాటకోత్సవాల్లో 3వరోజు శనివారం రాత్రి 6.30గంటల నుండి నాగా నాటకం సుంగ్రా; 8గంటల నుండి మాయబేట్ కన్నడ నాటకం ప్రదర్శింపబడతాయని నిర్వాహకుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు.

## పాతబస్తీలో భవ్య శోభా యాత్ర



సమావేశంలో పాల్గొన్న కావడి సంఘం ప్రతినిధులు

**చార్మినార్,ఆగస్టు 2 ప్రభాతవార్త :**

భాగ్యనగర్ కావడి సేవా సంఘం హైదరాబాద్- సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఆగస్టు నెల నాలుగువ తేదీన 27 భవ్య కావడి శోభాయాత్రను నిర్వహించనున్నామని కావడి సంఘం అధ్యక్షులు మాంగేరామ్ తాహెల్ తెలిపారు. పాతబస్తీలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెల 4వ తేదీ ఉదయం 6.30 గంటలకు చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరం నుంచి 27వ భవ్య కావడి శోభా యాత్ర ప్రారంభమై 5వ తేదీ ఉదయం ఐదు 5 గంటలకు కూకట్‌పల్లిలోని శ్రీ ద్వాదశి జ్యోతిర్లింగం మందిరానికి చేరుకుటుందని తెలిపారు.హరిద్వార్ నుంచి తెచ్చిన గంగాజలంతో అభిషేకం జరుగుతుందని ఆయన తెలియజేశారు.శోభాయాత్ర సందర్భంగా శివ బండార్‌తో పాటు శివ మహా జాగరణ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలియజేశారు.ఈ సమావేశంలో భాగ్యనగర్ కావడి సేవా సంఘం ప్రతినిధులు సురేంద్ర అగర్వాల్,సునీల్ కుమార్ అగర్వాల్,చంపాలాల్ వేద్,కమల్ కిశోర్ మాలాణి, పురుషోత్తం అగర్వాల్, పంకజ్ వర్మ,రుబీ మిశ్ర,మీను గుప్తా,అభినవ్ అగర్వాల్,మీను గుప్త,అజయ్ అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా 'యువత నైపుణ్య విశ్వవిద్యాలయం'
### -టిపిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్

**చిక్కడపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో చరిత్రలో నిలిచిపోయే విధంగా సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా 'యువత నైపుణ్య విశ్వవిద్యాలయం' ఏర్పాటు చేయడం విశేషమని టిపిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్ అన్నారు. అసెంబ్లీలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బిల్లు' ఆమోదం పొందడం ఇందుకు నిదర్శనమన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం అందించేయడం, లాభాపేక్ష లేని చట్టబద్దమైన సంస్థగా విశ్వవిద్యాలయం దేశంలోనే గొప్ప పేరును సంపాదించబోతుందన్నారు.

### కారు ఫ్లైఓవర్‌ను ఢీకొట్టిన ఘటనలో విద్యార్థి మృతి

**సైబరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 2 ప్రభాతవార్త**

అతివేగంతో దూసుకువచ్చిన కారు అదుపుతప్పి ఫ్లైఓవర్‌ను ఢీకొట్టిన ఘటనలో కారు నడుపుతున్న విద్యార్థి ఘటనా స్థలంలోనే మృతిచెందిన ఉదంతం శుక్రవారం తెల్లవారు జామున రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈఘటనకు సంబంధించిన వివరాలు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం ఇలావున్నాయి. యూసుఫ్‌గూడ రెహమత్ నగర్‌కు చెందిన చైతన్య(19)ఇక్ఫాయ్ యూనివర్సిటీలో బిబిఎ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. కాగా చైతన్య శుక్రవారం తెల్లవారుజామున తన తాతకు చెందిన మారుతి స్విఫ్ట్ డిజైర్ (టిఎస్09ఎఇ8919)కారులో ఇంటినుంచి బయలుదేరి ఫిలింనగర్ మీదుగా మెహదీపట్నం బయలుదేరాడు. కారు షేక్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద ఫ్రీలెఫ్ట్ తీసుకోవాల్సివుండగా అప్పటికే అతివేగంలోవున్న కారు అదుపుతప్పి తెల్లవారుజామున 3.45గంటల ప్రాంతంలో ఫ్లైఓవర్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా అందులోవున్న చైతన్య కారులోనే ఇరుక్కుపోయి ప్రాణాలు విడిచాడు. విషయం తెలుసుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతున్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉప్పల్‌లో కలకలం రేపిన లిటిల్ ఫ్లవర్ స్కూల్ సంఘటన


లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపల్‌తో వాగ్వివాదం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారిపై జరిగిన లైంగిక వేధింపుల సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. స్కూల్‌లో గురువారం మధ్యాహ్నం సంఘటన జరుగగా, శుక్రవారం ఉదయంవరకు విషయం బయటకు రాకుండా స్కూల్ నిర్వహకులు, కొందరు పోలీసులు రాజీ ప్రయత్నం చేసినట్లు విమర్శలు ఉన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఒక బాలుడు గురువారం మధ్యాహ్నం సమయంలో పాఠశాల తరగతి గదిలో అదే పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న చిన్నారిని గదిలోకి పిలిపించి అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థుల ఉండగానే ఈ విధంగా చేయడంతో చిన్నారి భయాందోళనలకు గురైంది. దీంతో గురువారం సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత చిన్నారి తల్లికి చెప్పడంతో వెంటనే స్కూల్‌వద్దకు వచ్చి నిర్వహకులకు సమాచారం చెప్పింది. స్కూల్ నిర్వహకులు ఇరువర్గాలను పిలిపించి మాట్లాడించి ఇంటికి పంపించారు.

## తల్లిదండ్రుల ఆందోళన : విద్యార్థి సంఘాల ధర్నా

శుక్రవారం ఉదయం చిన్నారి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి విషయాన్ని మిగిలిన చిన్నారుల తల్లిదండ్రులకు చెప్పారు. అందరూ కలిసి స్కూల్ వద్ద ఆందోళన నిర్వహించారు. వీరికి వివిధ రాజకీయ పార్టీల నేతలు మద్దతు పలికారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేయగా, ఉపాధ్యాయుల తీరుపై పలువురు తీవ్రంగా మండిపడ్డారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపించారు. జరిగిన తతంగం సిసి కెమెరాలలో రికార్డు కావడంతో పోలీసులు దానిని సీజ్ చేశారు. అప్పటికే వీడియోలు బయటికి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**బిజెపి, కాంగ్రెస్, సిపిఎం, ఎఐఎస్ఎఫ్ నేతల ధర్నా :** లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జరిగిన సంఘటనపై పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెవైఎం, మహిళా మోర్చ యూత్ కాంగ్రెస్, సిపిఎం, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల నేతలు స్కూల్ ముందు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. బిజెవైఎం నేతలు గోనె శ్రీకాంత్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, సింగారం కార్తీక్, బిజెపి మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, యూత్ కాంగ్రెస్ నేత అకారపు అరుణ్‌కుమార్, సిపిఎం కార్యదర్శి జె.వెంకన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాదోడ్ సంతోష్, అన్వర్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద తదితరులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్షలలో ఫీజుల వసూలు చేస్తున్న యజమాన్యం విద్యార్థుల విషయంలో పట్టించుకోవడం లేదని, చిన్నారిపై లైంగిక వేధింపులు జరిగినా కూడా బయటకు రాకుండా రాజీ బేరం చేశారని ఆరోపించారు. పాఠశాల గుర్తింపు రద్దు చేసి యజమాన్యంపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

## కాంగ్రెస్‌పాలనతో మహేశ్వరానికి మహర్దశ



సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ సమీపంలోని బేగరికంచలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా నైపుణ్యాభివృద్ధి విశ్వ విద్యాలయానికి శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్‌రెడ్డిని టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమానికి వచ్చేసిన సిఎంకు స్వాగతం పలికిన ఆయన మహేశ్వరం నియోజకవర్గంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేసి రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మహేశ్వరంకు మహర్దశ పట్టనుందని అమరేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## వాజ్‌పేయినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం..

**నేరెడ్‌మెట్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని వాజ్‌పేయినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఇ గోపాల్ పేర్కొన్నారు.11కెవి ఆర్.కె.పురం (డి.టి.ఆర్) వాజ్‌పేయినగర్ సబ్‌స్టేషన్‌పరిధిలోని ఆర్.కె పురం, బృందావన్ కాలనీ, జి.కె కాలనీ, అంతయ్య కాలనీ, సంతోష్ కాలనీ, బాలాజీ కాలనీల్లో ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు, 11కెవి వాయుపురి సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్.కె.హెచ్ కాలనీ, సాయినాథ్ పురం, ఎ.యన్ కాలనీ, సాయినగర్‌లతో మధ్యాహ్నం 1గంట నుండి 1:30 వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రజక వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : రవీంద్రాచారి


సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రాచారి

**హయత్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** తెలంగాణలో గత ప్రభుత్వం వృత్తిదారులను నిర్లక్ష్యం చేసిందని, సమాజానికి ప్రత్యక్షంగా సేవచేసే వర్గాలలో ఒకటైన రజక చేతివృత్తిదారులు నేటికి నిర్లక్ష్యానికి గురవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి అన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటి తుడుపు పథకాలతో పది సంవత్సరాల పాటు కాలం గడిపిందని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సమాజంలోని సేవకులైన వృత్తికులాల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలన్నారు. 40 లక్షల మంది రజకులు ఉన్న రాష్ట్రంలో వెయ్యికోట్లతో రజక ఫెడరేషన్‌ను, పాలకమండలిని ఏర్పాటు చేయాలన్నారు. సాంఘీక భద్రత చట్టాన్ని రూపొందించాలని, జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలని, రజకవృత్తిదారుల సొసైటీలకు రుణాలు మంజూరు చేయాలని, మోడ్రన్ ధోబీఘాట్లను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, నాయకులు పగడాల ఎల్లయ్య, ఐతరాజు బిక్షపతి, ఎస్.సైదారావు, నరసింహ పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : చిట్టుపాక


అంబేద్కర్ విగ్రహానికి నివాలులర్పిస్తున్న ప్రభాకర్ మాదిగ తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ పేర్కొన్నారు. చిట్టుపాక ప్రభాకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో యేళ్ల పోరాటానికి నేడు ఫలితం లభించిందని దళితులందరికీ ఇది పండుగ రోజని హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇమ్మడి నాగయ్య, రమేష్, వెంకటస్వామి, సతీష్, ముత్తయ్య, నవీన్, వీరస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిబిఎస్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి నియామకం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య (టిబిఎస్ఎస్ఎస్) గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా పి.విజయలక్ష్మి నియామకమయ్యారు. ఆర్కేపురంలో శుక్రవారం జరిగిన టిబిఎస్ఎస్ఎస్ సమావేశంలో విజయలక్ష్మికి అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మునిపల్లె మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డులోపల ఉన్న అన్ని ప్రాంతాలలో అందరినీ కలుపుకుని, సంఘ సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. సంఘాన్ని పటిష్టం చేయడానికి అందరినీ సమన్వయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు పి.కల్పవల్లి, గ్రేటర్ హైదరాబాద్ కోశాధికారి పి.రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం తీర్పు హర్షణీయం : ఎస్సీ సంఘాలు

**తుర్కయంజాల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని ఈ సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో తుర్కయంజాల్ కూడలిలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మంచి ఫలితాన్ని ఇచ్చిందని ఆ దిశగా ఉద్యమాన్ని నడిపిన మందకృష్ణ మాదిగకు పాలాభిషేకం నిర్వహించి, మిఠాయిలు పంచుకొని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్, ఛత్రపతి యువజన సంఘాల నాయకులతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ మాదిగకు ఎమ్మార్పీఎస్ పాలాభిషేకం

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తాలో, బాలాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వర్గీకరణ కోసం సుదర్ఘీ పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చౌరస్తాలో బాణసంచా కాల్చిన నాయకులు మంద కృష్ణ పోరాటాన్ని గుర్తు చేస్తూ ఆయనకు కృతజ్ఞతగా పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మారీ ఎస్ అధికార ప్రతినిధి బొర్ర రవి మాదిగ, బాల్‌నింగని జంగయ్య, ఇందిరలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి మరిన్ని నిధులు ఇవ్వాలి: మంగు రాఘవరావు

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** బ్రాహ్మణ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం, రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు కోరారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.50 కోట్ల నిధులను ప్రభుత్వం ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయించిందనీ అయితే ఈ సారి అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 150 లేదా 200 కోట్లకు పెంచితే బాగుండేదని ఆయన అన్నారు. పేద బ్రాహ్మణ కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన సిఎంను కోరారు.

## ముంపుకు గురికాకుండా సమస్యను పరిష్కరించాలని అధికారులకు వినతి


అధికారులతో కలిసి కాలనీలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగుల

**వనస్థలిపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆర్ అండ్ బి ఈఎంసి గణపతిరెడ్డి జిహెచ్‌ఎంసి ఇఇలతో కలిసి డివిజన్‌లోని అభ్యుదయ కాలనీలో రోడ్డు కన్నా ఎత్తు వేయడంతో వర్షం నీటికి అభ్యుదయ కాలనీ, జనప్రియ కాలనీ ముంపుకు గురయ్యే అవకాశం ఉందని పై నుంచి వచ్చే వరద నీటిని మళ్లించడానికి కార్పొరేటర్, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు గంగిరెడ్డి, పవన్ ఆర్ అండ్ బి, ఈఎంసి అధికారులతో కలిసి కాలనీలలో పర్యటించి సమస్యలను అధికారులకు వివరించి వీలైనంత త్వరగా పరిష్కరించవలసిందిగా కోరారు. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా క్రింది అధికారులతోపాటు జిహెచ్‌ఎంసి అధికారులను అప్రమత్తంగా ఉండి సమస్యను పరిష్కరించాలను అధికారులు సూచించారు.

## లిటిల్ ఫ్లవర్ స్కూల్‌పై ఉప్పల్ పోలీసులకు యూత్ కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు అకారపు అరుణ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు ఎస్ఐ చిరంజీవిని కలిసి ఫిర్యాదు చేశారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారిపై లైంగిక దాడి యత్నం జరిగిందని, యజమాన్యం కేసు రాజీ చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. స్కూల్‌లో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నా యజమాన్యం చూసీ చూడనట్లు వ్యవహరించడం సబబు కాదన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేతలు బజారు నవీన్‌గౌడ్, కప్పల సాయి, అశోక్, ప్రశాంత్‌రెడ్డి, రంగుల శేఖర్, చంద్రశేఖర్, భాను, భాస్కర్, రాఘవేంద్ర, శివకాంత్, జయంత్, బాబు, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పింగళి వెంకయ్య మనువడికి సత్కారం


జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా వారి మనువడిని సత్కరిస్తున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ దంపతులు

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ శుక్రవారం పింగళి వెంకయ్య మనువడు జివిఎస్ నరసింహారావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య సేవలు అభినందనీయమన్నారు. పింగళి మనువడిని సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేశానికి సేవలు చేసిన పింగళి కుటుంబీకులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## 15యేళ్ల లోపు పిల్లలకు టీకా కార్యక్రమం


టీకా కార్యక్రమంలో పాల్గొన్న ఐలయ్య, డాక్టర్ శృతి తదితరులు

**తుర్కయంజాల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 15 సంవత్సరాల లోపు బాలబాలికలకు జపనీస్ ఎన్సెఫాలిటిస్ (మెదడు వాపు) టీకాలు సిఎం రేవంత్‌రెడ్డి,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహ్మా, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డిల ఆదేశానుసారంతో సుమారు 400 మంది బాలికలకు టీకాలు ఇచ్చే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతి మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే ప్రాణాంతకమైన వైరల్ ఇన్ఫెక్షన్‌ను నివారించడానికి జపనీస్ ఎన్‌సెఫాలిటిస్ (ఏఇ) వ్యాక్సిన్ ఉపయోగపడుతుందని దాని ప్రాముఖ్యత గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్తకుర్మ కుమార్, సెక్టార్ సూపర్‌వైజర్ నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 7వ తేదీ నుంచి కొత్తపేట ప్రసన్న మహాకాళి అమ్మవారి బ్రహ్మోత్సవాలు


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ప్రకాష్ గౌడ్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** కొత్తపేట్ శ్రీశ్రీశ్రీ ప్రసన్న మహాకాళి అమ్మవారి ఏకాదశ వార వార్షిక బ్రహ్మోత్సవాలు, తెలంగాణ బోనాల జాతర పండుగ కార్యక్రమ పత్రికను శ్రీ ప్రసన్న మహాకాళి దేవాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా ఆవిష్కరించారు. వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 7వ తేదీ నుంచి 9వ వరకు నిర్వహిస్తున్నామని, 11వ శ్రీ ప్రసన్న మహాకాళి అమ్మవారి బోనాల జాతర కార్యక్రమం ఉంటుందని ఆలయ ట్రస్ట్ చైర్మన్ వజీర్ ప్రకాష్‌గౌడ్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వజీర్ బాలకృష్ణగౌడ్, తోట శ్రీనివాస్ యాదవ్, జాతీయ గౌడ సంఘాల జేఏసీ ముఖ్య సలహాదారులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, వజీర్ గోపిగౌడ్, ప్రవీణ్ గౌడ్, చావా సత్యనాగదుర్గ ప్రసాద్, కోయిగూర రమేష్‌గౌడ్, నాగేష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, వాసు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల మార్కెట్ కార్యదర్శిగా శ్రీనివాస్

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా లోకిని శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలో భాగంగా శ్రీనివాసును గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ కార్యదర్శిగా బదిలీ చేశారు. కాగా ఇక్కడ పని చేస్తున్న కార్యదర్శి నరసింహారెడ్డినుంచి శుక్రవారం శ్రీనివాసులు బాధ్యతలను తీసుకున్నారు ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గడ్డి అన్నారం పండ్ల మార్కెట్లో రైతులను వ్యాపారస్తులను సమన్వయ పరుస్తూ ముందుకు వెళ్తాన న్నారు.

## ఎస్సీ వర్గీకరణ తీర్పు హర్షణీయం: అర్జున్

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ సూర్గంటి అర్జున్ అన్నారు. దాదాపు 30 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ వర్గీకరణకు చేస్తున్న పోరాటానికి న్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం వెలువరించిన తీర్పును తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు.

## డివిజన్ అభివృద్ధి కృషి : కార్పొరేటర్ రాజ్యలక్ష్మి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి..

**నేరెడ్‌మెట్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** డివిజన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, శివనగర్ ఫేస్-2లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ నాయకులు, కాలనీ వాసులు, సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యమైన వస్తువులను వినియోగించాలన్నారు. పనులను త్వరగా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఇ సత్యలక్ష్మి, డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, సాయి సురేష్, కాలనీ వాసులు శ్రీధర్, శ్రీధర్ బాబు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ గాంధీ గిరిజనబస్తీలో ఇంటింటి చెత్త సేకరణ బేష్ : డిసి ఆంజనేయులు


గిరిజనబస్తీలో మొక్కలు నాటుతున్న డిసి అంజనేయులు తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని గాంధీ గిరిజన బస్తీలో ఇంటింటి చెత్త సేకరణలో విజయం సాధించారు. మున్సిపల్ అధికారులు ఇంటింటి చెత్త సేకరణకు సహకరించిన కాలనీలకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే హబ్సిగూడలోని గాంధీ గిరిజనబస్తీలో చెత్త హాని కలిగించే పాయింట్లు తొలగించడంతోపాటు, ప్రజలకు చెత్త సేకరణ పై అవగాహన కల్పించారు. దీంతో కాలనీలో వంద శాతం ఇంటింటి చెత్త సేకరించే కాలనీగా గుర్తించారు. ఈసందర్భంగా శుక్రవారం కాలనీలో జరిగిన కార్యక్రమంలో డిసి అంజనేయులు, శానిటేషన్ డిఇ చందన తదితరులు పాల్గొని కాలనీవాసులను అభినందించారు. చెత్త పాయింట్లు తొలగించిన ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కాలనీలో వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ జరుగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు : డిఇ


సమస్యలు తెలుసుకుంటున్న డిఇ సురేష్ తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చంపాపేట డివిజన్ విద్యుత్ డిఇ సురేష్ పేర్కొన్నారు. సాగర్ హౌజింగ్ కాంప్లెక్స్‌లో డిఇ సురేష్ ఆధ్వర్యంలో అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పేర్కొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొనడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంపాపేట డివిజన్ విద్యుత్ శాఖ పరిధిలోని ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఇ రాంచందర్, ఎఇ రణధీర్, కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ విజయలక్ష్మి వంజరికి ఘన సన్మానం


వంజరి విజయలక్ష్మిని డాక్టరేట్‌తో సత్కరిస్తున్న దృశ్యం

**తార్నాక, ఆగస్టు 2 ప్రభాతవార్త:** వివిద సేవా కార్యక్రమాలను చేపట్టిన రాష్ట్ర వంజరి సంఘం ట్రస్ట్ బోర్డు సభ్యులు, మేడ్చెల్ సాయి బాబా మందిర వ్యవస్థాపకులు ధాత్రిక సింహ్మాం వంజరికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా తార్నాకలోని వంజరి సంఘం రాష్ట్ర కార్యాలయంలో వంజరి కులస్థులు ఘనంగా సన్మానించారు. 30 సంవత్సరాలుగా రాజకీయ రంగంలో, వంజరి కులస్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ధాత్రిక సింహం వంజరి నీలి విజయలక్ష్మి వంజరి సఘంలో విద్యాకమిటీ చైర్మన్‌గా భాధ్యతలను నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా రవీంద్రభారతీలో కూడ ఘనంగా సన్మానించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హుమన్ రైట్స్ సంస్థ గౌరవ డాక్టరేట్ను అందించింది. ఈ కార్యక్రమంలో బొగ్గగనుల సునీత వంజరి, గాయరు శోభ వంజరి, వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రదాన కార్యదర్శి కంధారి వెంకటేష్, కోశాధికారి కాలేరు అమరేందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రశ్నించే గొంతును నొక్కలేరు : అరవింద్ శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ తదితరులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రశ్నించే గొంతును నొక్కలేరని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్కేపురంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగే దొంగ అన్నట్లుగా సబిత ఇంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి దిష్టిబొమ్మ దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలో ఉండి మహిళా ఎమ్మెల్యేలను అవమానించడం తగదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలపై సబితారెడ్డి శాసనసభలో ప్రశ్నించినందుకే సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టివిక్రమార్క, మంత్రులు టార్గెట్ చేస్తూ అవమాన పర్చడం మానుకోవాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పి, అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, ఆకుల అరవింద్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, నవీన్, అనురాధ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఇండియా నైపుణ్యాభివృద్ధి విశ్వ విద్యాలయానికి శంకుస్థాపన చేయడానికి విచ్చేసిన సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బడంగ్‌పేట్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి (సరూర్‌నగర్, ప్రభాతవార్త)